www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 24 సెప్టెంబర్ 2023

5

తూర్పుగోదావరి

ఉత్తమ విద్యార్థులకు మంత్రి వనిత సత్కారం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు హోంమంత్రి తానేటి వనిత, నటి అనసూయ చేతుల మీదుగా బంగారు పతకాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగల్గుతారని అన్నారు. అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో మంత్రి తానేటి వనిత, సినీ నటి అనసూయలను ఎంఎల్ఎ జి శ్రీనివాస నాయుడు, రూడా ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి సాలువలతో ఘనంగా సత్కరించారు.

ఉత్తమ విద్యార్థిని సత్కరిస్తున్న మంత్రి

అంగన్‌వాడీలపై ఆర్థిక భారం..

▸ కూరగాయల బిల్లులకు తప్పని ఇబ్బందులు ▸ పెండింగ్‌లో రూ.28 లక్షలు బకాయిలు ▸ పట్టించుకోని పాలకులు

శిశుసంరక్షణ, పోషణ, గర్భవతుల, బాలింతల సంరక్షణ అంగన్వాడీల వాస్తవ బాధ్యత. వారికి ప్రభుత్వం సమకూర్చే పౌష్టికాహారం సక్రమంగా అందించడమే ఆ బాధ్యత. మన కన్నబిడ్డలకు తల్లుల్లా సేవలు చేసేది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు. క్షేత్ర స్థాయిలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలు ముందుకు సాగుతున్నాయంటే వీరి విశేష సేవలే నిదర్శనం. మన పిల్లల సేవలకు అంకితం కానీయకుండా అంగన్‌వాడీ తల్లులపై మానసిక ఒత్తిడిని పెంచేలా యాప్స్, సర్వేల పేరుతో పనిభారం మోపుతూ నానా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి ప్రభుత్వాలు. వీటికి తోడు ఆర్థికంగా ఇబ్బందులు పెట్టి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు.

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ప్రభుత్వం ఇటీవల టేక్ హోం రేషన్ పేరుతో లబ్ధిదారుల ఇంటికే సరుకులు చేర్చాలనే నిబంధనల తీసుకొచ్చింది. అదేవిధంగా చిన్నారులకు, గర్భిణీలకు వంట చేసి వడ్డించాలని ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటి వరకూ ఉన్న ఇబ్బందులకు తోడు ఈ విధానం అంగన్‌వాడీ కార్యకర్తలను మరిన్ని ఇబ్బందుల్లోకి నెడుతోంది. చిన్నారులకు, గర్భిణీలకు వంట చేయాలంటే అవసరమైన కూరగాయలు వీరే కొనుగోలు చేసుకోవాలి. అసలే చాలీ చాలని వేతనాలతో బతుకుబండిని లాక్కొస్తున్న వీరి పరిస్థితి ఆర్థికంగా మరిన్ని ఇబ్బందుల్లోకి నెట్టుతోంది. అయినా అప్పో చొప్పో చేసి కొనుగోలు చేసి చిన్నారులకు, గర్భిణీలకు వంట చేసి వడ్డించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అయితే కూరగాయలకు సంబంధించి నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలకు భారంగా మారింది. ఈ కేంద్రాలకు కూరగాయల బిల్లులు నెలల తరబడి రావడంలేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కూరగాయలకు నిత్యం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

జిల్లాలో 7 ప్రాజెక్టులు

జిల్లాలోని 7 ప్రాజెక్టుల పరిధిలో 1536 మెయిన్, 26 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు చొప్పున 1562 ఉన్నాయి. మెయిన్ కేంద్రాల్లో ఒక వర్కరు, హెల్పరుతో కలిపి మొత్తం 3072 మంది.. మినీ అంగన్ వాడీ కేంద్రాల్లో 26 మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతోపాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తారు. ఆరు నెలల పసిబిడ్డ నుంచి మూడేళ్ల పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇవ్వాలి. గత నెల నుంచి బాలింతలు, గర్భిణీలకు టేక్ హోం రేషన్ కింద ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. చిన్నారులకు మాత్రం కూరగాయలు కొనుగోలు చేసి కేంద్రాల్లోనే పదార్థాలను వండాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కార్యకర్తలకు కూరగాయల బిల్లులు అందించాల్సి ఉంది. కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారే తప్ప బిల్లుల మంజూరుపై చొరవ చూపడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ ప్రభావం పౌష్టికాహారంపై పడుతోంది.

అంగన్‌వాడీలపై ఆర్థిక భారం

ఐదారు నెలలకోసారి కూరగాయల బిల్లులు చెల్లిస్తుండడంతో అప్పులు చేయాల్సి వస్తుందని కార్యకర్తలు వాపోతున్నారు. వేతనాల్లో అయినా సర్దుబాటు చేసుకుందామంటే అవి కూడా సక్రమంగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో 20 మంది చిన్నారులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక్కొక్క విద్యార్థికి కూరగాయలు, పప్పుదినుసులు, గ్యాస్ కోసం రూ.2 ఖర్చు చేయాల్సి ఉంది. ఈ లెక్కన 20 మందికి రోజుకు రూ.40ల చొప్పున నెలకు రూ.1,200లు ఖర్చవుతుంది. ఒక్కో కేంద్రానికి చిన్నారుల సంఖ్యను

బట్టి కూరగాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి నెల వరకూ బిల్లులు చెల్లించారు. అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రావాల్సిన బకాయిలు సుమారు రూ.24 లక్షలు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే ప్రభుత్వం నుంచి ఈ గ్రాంటు విడుదలైనప్పటికీ సాంకేతిక కారణాలతో ఆ పెండింగ్ బకాయిలు జిల్లా ఐసిడిఎస్ పిడి ఖాతాలోనే ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు 'ప్రజాశక్తి ప్రతినిధి'కి వివరించారు. త్వరలోనే ఈ బకాయిలు సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తల ఖాతాల్లో జమ అవుతాయని, అంగన్‌వాడీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిడిపిఒ నర్సమ్మ తెలిపారు. వీటికితోడు జూలై, ఆగస్టు నెలకు సంబంధించి మరో 4 లక్షలు బకాయిలు ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం రూ.28 లక్షల వరకూ ఉన్నట్లు అంచనా. అంగన్‌వాడీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖ అధికారులు తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

రాష్ట్ర సదస్సు గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

4న నిరుద్యోగ సమస్యలపై రాష్ట్ర సదస్సు

పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

నిరుద్యోగ సమస్య పరిష్కారానికై ప్రత్యమ్నాయ విధానాలతో సిపిఎం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి సదస్సును అక్టోబర్ 4న నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ వెల్లడించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత యొక్క శక్తి సామర్థ్యాల్ని సక్రమంగా ఉపయోగించుకుంటేనే ఏ దేశమైనా అభివృద్ధి సాధిస్తుందన్నారు. 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను నిర్వీర్యం చేశాయని పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక 5 లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయని తెలిపారు. మోడీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తే బజ్జీలు, పకోడిలు అమ్ముకోండి అంటూ అమిత్ షా యువతకు ఉచిత సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. మోడీ చెప్పిన మేక్ ఇన్ ఇండియా ద్వారా ఉద్యోగాలు కల్పించలేదని, నల్లధనం బయటకు రాలేదన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు యువతకు తీరని ద్రోహం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వైసిపి అధినేత జగన్ చెప్పిన 2.35 లక్షల ఉద్యోగాలు నాలుగున్నరేళ్ల పాలనలో భర్తీ కాలేదని అన్నారు. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి నాలుగేళ్లలో ఒక క్యాలెండర్ ఇచ్చి అందులో కూడా ఉద్యోగాలు లేకుండా విడుదల చేశారని దుయ్యబట్టారు. ఎపిలో యువత పరిస్థితి దారుణంగా ఉందని, ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు లేక మరోవైపు ఉపాధి పరిశ్రమలు రాక యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బతుకు దెరువు భారమై ఆత్మహత్యలు చేసుకోవడం లేదా మద్యం, డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత తొమ్మిది సంవత్సరాల్లో రాష్ట్రానికి ఒక్క భారీ పరిశ్రమ రాకపోగ ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ఒక్క డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వని ఏకైక ప్రభుత్వంగా జగన్ సర్కార్ రికార్డు సృష్టించిందని ఎద్దేవా చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూసే గ్రూప్-2 నోటిఫికేషన్ రాలేదని, ఇప్పుడు ఎన్నికల ముందు హడావుడిగా ఎపిపిఎస్‌సి గ్రూపు 1, 2 కలిపి 500 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. సుమారు 7 లక్షల మంది నిరుద్యోగులు గ్రూపు-2 కోసం ఎదురుచూస్తుంటే ఖాళీలతో సంబంధం లేకుండా పాలకులు మాట్లాడటం మంచిది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 9.64 లక్షల ఉద్యోగాలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి ప్రకటించి 25 వేల ఉపాధ్యాయ పోస్టులు, పిఈటిలతోకలిపి భర్తీ చేయాలనే డిమాండ్‌తో సిపిఎం అనేక పోరాటాలను సాగిస్తుందని, రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు నిరుద్యోగులను సన్నద్ధం చేసే లక్ష్యంతో రాష్ట్ర స్థాయి సదస్సును అక్టోబర్ 4న రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిపిఎం సూత్రబద్ధ రాజకీయాలతో యువత యొక్క శక్తి సామర్థ్యాన్ని అభివద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు నూతన ప్రత్యామ్నాయ విధానాలను రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా నాయకులు ఎస్ఎస్.మూర్తి, బి.రాజులోవ పాల్గొన్నారు.

30 నుంచి మెగా క్యాంపుల నిర్వహణ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదు మెగా క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ కె.లక్ష్మీ ప్రియ తెలిపారు. శనివారం చాగల్లు సచివాలయం -2 పరిధిలో ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రియ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న చాగల్లు-2 సచివాలయం పరిధిలోను, అక్టోబర్ 10న చాగల్లు - 3 సచివాలయం పరిధిలోను, 13న నెలటూరు సచివాలయం పరిధిలోను, 18న చాగల్లు-4 సచివాలయం పరిధిలోను, 19న చాగల్లు-5 సచివాలయం పరిధిలోను క్యాంపులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తడి, పొడి చెత్తలను వేరు చేయడం ద్వారా వచ్చే ప్రయోజనాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ వీర వెంకట సత్యనారాయణ సూచించారు. స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దమ్మెన్ను పాఠశాల్లో శనివారం విద్యార్థినీ, విద్యార్థులకు తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరించే విధానంను తెలుసుకోవాలని, తద్వారా తమ గృహాల వద్ద తల్లీదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పండ్లు, కూరగాయల వ్యర్థాలు, ఎంగిలి మెతుకులు, వంటివి తడి చెత్త కిందకి, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, చాక్లెట్ రేపర్లు, వంటివి పొడి చెత్తకు కిందకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం నాగమణి, మహిళా పోలీసు కౌసల్య, ఎంఎల్‌హెచ్ పి రమ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెరవలి

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పిట్టల వేమవరం, ఖండవల్లి గ్రామాల్లో శనివారం పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఎంఎల్ఎ పాల్గొన్నారు. పిట్టల వేమవరంలో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఖండవల్లి గ్రామంలో రూ.16 లక్షలతో రజకుల ఏరియాలో సిసి రోడ్, ఎస్‌సి ఏరియాలో రూ.16.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25.94 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, వైసిపి నాయకులు వీరమల్లు సత్యనారాయణ, రాంబాబు, కుసుమే సూరిబాబు, తాతారెడ్డి, మండ హైమ చిన్న వెంకటరెడ్డి, కుసుమే సూరిబాబు, వేండ్ర శ్రీనివాస్, పల్లేటి రవి, తదితరులు పాల్గొన్నారు.

బాబుకు బాసటగా.. కొనసాగిన టిడిపి దీక్షలు..

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు బాసటగా టిడిపి శ్రేణులు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో రిలే నిరహార దీక్షలు,కొవ్వొత్తుల ప్రదర్శన, కాగడాల ర్యాలీలు నిర్వహిస్తూ సంఘీభావం వ్యక్తం చేస్తున్నారు. **రాజమహేంద్రవరం** కోరుకొండ రోడ్డులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని శ్రీనివాస్, మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, నాయకులు గన్ని కష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, చిల్లా జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ దీక్షలో ముస్లిం మైనారిటీలు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. **తాళ్లపూడి** మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో టిడిపి యువగళం

రాజమహేంద్రవరం దీక్షలో ముస్లిములు

శనివారం ఇంటింటికి భిక్షాటన చేస్తూ ప్రజలను అభ్యర్థించారు. బొచ్చెలతో ఇంటింటికి తిరుగుతూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. యువగళం నిరసనలు తెలుసుకున్న తాళ్లపూడి పోలీసులు అన్న దేవర పేట గ్రామానికి రావడంతో పోలీసులతో వాగ్వివాదం జరిగింది. అనంతరం నాయకులను పోలీసులు తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ నిరసన కార్యక్రమాల్లో యువ గళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, తొండెపు భరత్, కూచిపూడి జగన్ తదితరులు పాల్గొన్నారు. **నిడదవోలు** డి.ముప్పవరంలో జరుగుతున్న రిలే నిరహారదీక్షా శిబిరాన్ని నిడదవోలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు శని వారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన ముస్లింలు, బిసిలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, కారింకి నాగేశ్వరరావు, భూపతిరాజు రవివర్మ, జుజ్జవరపు సూర్య భాస్కరరావు, నల్లూరి పుష్పవతి, బుగ్గే శివ రామకష్ణ శాస్త్రి పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని బ్రాహ్మణగూడెం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద గారపాటి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిరహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కరుటూరు సతీష్, కె.ప్రసాద్, పోతుల శ్రీనివాస్, అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిఇఒ అబ్రహాం

పాఠశాలలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దారి, దమ్మెన్ను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ అబ్రహం శనివారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలన చేసి పూర్తిచేసిన విద్యార్థులను అభినందించారు. వర్క్ బుక్కులు పూర్తికాని విద్యార్థులచే ఫోన్ కాల్ కార్యక్రమం లోపల పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ -1 సిహెచ్ సెక్సేనరాజు, ఎంఇఒ-2 శారదా జోత్స్న, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజానగరం

ఈనెల 22, 23వ తేదీల్లో ఆదిత్య ఫార్మసీ కళాశాలలో జరిగిన జాతీయ ఫార్మసీ సదస్సులో వివిధ విభాగాల్లో దివాన్ చెరువు గ్రామంలోని విజెఎస్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు వి ఉమా చంద్రావతి, పి నవ్యశ్రీ, ఎ.జ్యోతి పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి బహుమతి గెలుపొందారు. జి దాక్షాయిని, కె.మౌనిక లక్ష్మికి మొదటి బహుమతి, మూడో సంవత్సరం బి ఫార్మసీ చదువుతున్న విద్యార్థిని వి.శివ కళ్యాణికి పాటల పోటీలో మొదటి బహుమతి లభించింది. మౌఖిత ప్రదర్శన విభాగంలో కళాశాల ఉపాధ్యాయిని కుమారి స్వాతికి బహుమతి లభించింది. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి జగన్మోహన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నరేంద్ర, కళాశాల ఛైర్‌పర్సన్ విద్యార్థులను అభినందించారు.

స్థాయీ సంఘం దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి - బిక్కవోలు

మండలంలో నెలకున్న పలు సమస్యలను జెడ్‌పి స్థాయీ సంఘం సమావేశం దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా మహిళా స్థాయీ సంఘం ఛైర్మన్, జడ్‌పిటిసి రొంగల పద్మావతి వెల్లడించారు. ఎంపిపి స్కూల్లో ఖాళీగా ఉన్న తరగతి గదిని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, గృహా నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు సకాలంలో రాక లబ్ధిదారులు పడుతున్న బాధలతోపాటు, రైతుల పొలాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాల్సివుందని స్థాయీ సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు చొరవ చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కొవ్వూరు

జగనన్న కాలనీల్లో లబ్దిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, లబ్దిదారులు గహనిర్మాణాలను వేగవంతం చేసి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మండలంలోని కాపవరం గ్రామంలో జగనన్న కాలనీ లే అవుట్‌లో నిర్మించిన గహ నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వం ఉచితంగా అందచేసిన ఇంటి స్థలంలో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు కుంటలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లకు తెల్లరంగు వేయాలని గహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామ వాలంటీర్ పి. రేవతి ఇంటిని సందర్శించిన కలెక్టర్‌కు హారతి ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, ఆర్‌డిఒ ఎస్. మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్‌ను సందర్శిస్తున్న కలెక్టర్

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కడియం

మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు కోరారు. కడియం గ్రామంలోని భాస్కర్ నగర్‌లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూరల్ నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మంజూరు చేసిన నిధులతో పలు అభివద్ధిపనులు చేపట్టడం జరిగిందన్నారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.

కార్టూ'నిజం'



చర్చలో పాల్గొన్నందుకు అరెస్టు చేశారు..

నేనెవరితో చెప్పుకోవాలి..!!

'ప్రతిపక్షాలను చిత్తు చేయాలి'

ప్రజాశక్తి -కొవ్వూరు రూరల్

ప్రజాసంక్షేమ పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు వేస్తున్న ఎత్తులను చిత్తు చేసేలా ముందుకు సాగాలని హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో శనివారం ఆమె కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాలు గున్నరేళ్ల వైసిపి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్క నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుం దన్నారు. గత ఎన్నికల్లో 175 స్థానాల్లో 151 స్థానాల్లో గెలిచామని, రానున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాల్లో ఘనవిజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఇప్పుడు ప్రతిపక్షాలు అన్నీ కలిసి గుంపులు, గుంపులుగా వస్తున్నా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్ లైన్‌ను చుట్టేసిన తీగలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవలేశ్వరంలోని ఇరిగేషన్ విభాగానికి చెందిన జిటిపిఎస్ క్వాటర్స్ వాటర్ ట్యాంక్‌కు విద్యుత్ సరఫరా అయ్యే వైర్లకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయాయి. దీంతో విద్యుత్ స్తంభం ఎక్కడ ఉంది? వైర్లు ఎక్కడ ఉన్నాయి? అనే విషయం తెలియక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఎటువంటి ప్రమాదాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందనే భయంతో ప్రజలు ఉన్నారు. విద్యుత్ వైర్లను అంటుకుని వివిధ రకాల మొక్కలకు చెందిన తీగలు ఉంటడంతో ఎప్పుడు ఏ ఉపద్రవాన్ని ఎదుర్కొవాల్సివస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితిని ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వైర్లకు అల్లుకున్న తీగలను తొలగించి పొంచివున్న ప్రమాదాన్ని అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సామూహిక సీమంతాలు

సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - పెరవలి

ముక్కామల గ్రామంలోని అంగన్వాడి కేంద్రాల్లో శనివారం గర్భిణీ స్త్రీలకు సీమంతాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 16 మంది గర్భిణీ స్త్రీలకు చీర, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, డ్రై ఫ్రూట్స్, పళ్ళు, స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపిపి వీరమల్లు సత్యనారాయణ, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాసు, ఎంపిటిసి గండేపల్లి రామకష్ణ, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, వైసిపి నాయకులు అరిగెల శ్రీనివాసు, సిడిపిఒ శ్రీ లక్ష్మి, సూపర్‌వైజర్ సిహెచ్ లక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల వినియోగం ఎంతో మేలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గర్భవతులు, బాలింతలకు చిరుధాన్యాలను వినియోగించడం వల్ల ఎంతో మేలు జరుగుతాదని గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అన్నారు. పౌష్టికాహార వారోత్సవాలలో భాగంగా శనివారం తాడిపర్రు అంగన్వాడి సెంటర్లో చిరుధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలు, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. దీంతోపాటు గర్భవతులు తీసుకోవలసిన ఆహారం కొరకు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కట్టా వెంకటేశ్వర రావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సారా విక్రేతకు ఏడాది జైలు

ప్రజాశక్తి-కొత్తపేట

సారా కేసులో పట్టుబడిన నిందితునికి ఒక సంవత్సరం జైలు శిక్ష మరియు రూ.5వేల జరిమానా విధిస్తూ కొత్తపేట జెఎఫ్‌సిఎమ్ కోర్టు న్యాయమూర్తి అయిన ఎం.భాస్కర రావు తీర్పునిచ్చారు. శనివారం వివరాలను ఎస్ఇబి కొత్తపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట ఎఇబి స్టేషన్ నందు 5 లీటర్ల సారాతో పట్టుబడిన వాడపాలెం గ్రామానికి చెందిన చోడపనేడి సూర్య చంద్ర నాగరాజు ను, కేసు విచారణ నందు నేరం రుజువు కావడంతో పై విధముగా జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు తెలిపారు .ఈ కేసులో ఎపిపి ఎన్.ఆనంద రావు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. ఈ కేసు దర్యాప్తు పూర్తి చేసి, ఛార్జి షీట్ వేసి, ట్రయల్ పర్యవేక్షించిన, కొత్తపేట ఎస్ఇబి సిఐ మద్దాల శ్రీనివాస్ మరియు కోర్టు మానిటరింగ్ హెడ్ కానిస్టేబుల్ కె.చంద్ర మౌళీలను, జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ తదితరులు అభినందించారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-కోటనందూరు

సారా విక్రయిస్తున్న శనివారం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారని తుని పట్టణ ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తుని పట్టణము కొండవారిపేట చెందిన అనుకుల నూకరాజు, లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంకి పూడి సింహాచలం దగ్గర ఐదు లీటర్ల సారాన స్వాధీనం చేసుకున్నామని అన్నారు. మత్తు పదార్థాలు సారాయి, గంజాయి తదితర మాదకద్రవ్యాలు విక్రయాలు సాగిస్తే చేస్తే చర్యలు తీసు కుంటామని ఆయన హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో శనివారం ఎస్ఐ బివై.కుమార్ పేకాట శిబిరాలపై తన సిబ్బందితో దాడులు నిర్వహించారు ఈ దాడుల్లో ర్యాలీ గ్రామం శివారు పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,10 స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-కాకినాడ

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాకు సంబంధించి నిత్యావసరాల చట్టం-1955, సెక్షన్ 6ఎ కింద అయిదు కేసులను విచారించి, సీజ్ చేసిన రూ.3,40,524 విలువైన సరుకును ప్రభుత్వానికి జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎఫ్‌పీ షాపు డీలరుకు రూ.5 వేలు జరిమానా విధించామన్నారు. ఈ మొత్తం పౌర సరఫరాల ఖాతాకు జమవుతుందన్నారు.

పాత్రికేయుని బైక్ దగ్ధం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని సిరిపురం గ్రామంలో నివసిస్తున్న ప్రతిపాడు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి డి. శ్రీనివాస్ బైకు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. శ్రీనివాస్ యథ్యావిధిగా విధులు నిర్వహించుకుని వచ్చి శుక్రవారం రాత్రి తన ఇంటి గేటు బయట పార్కింగ్ చేసిన పల్సర్ మోటార్ సైకిల్ తెల్లవారే సరికి దగ్ధమైంది. ఈ ఘటనపై శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

ప్రజాశక్తి -ఐ పోలవరం

ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ ప్రవేశ పెట్టిన దగ్గర నుంచి ఇసుక అందు బాటులో లేకుండా పోయింది. చుట్టూ గోదావరి ఉన్న స్థానికులకు గృహ అవసరాలకు ఇసుక మాఫియా చెలరేగి పోయి అక్రమంగా రాత్రి వేళల్లో తరలించుకు పోతున్నారు. జి మూలపొలం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ముగ్గుల బట్టీల రేవు వద్ద శుక్రవారం అర్ధ రాత్రి సమయంలో అక్రమ ఇసుక తలిస్తున్నారని పోలీసులకు సమాచారం తెలియడంతో హుటా హుటిన చేరుకున్నప్పటికీ పోలీసులకు కంట పడకుండా ఇసుకతో ఉన్న పడవను తప్పించారు.

వంశీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి

మృతుల కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ ఐ పోలవరం మండలంలో శనివారం పర్యటించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మురమళ్ల గ్రామ పంచాయితీ పరిధిలో లైన్ పేట కు చెందిన లంక వంశీ శ్రీ మృతి చెందినాడు. అదే గ్రామానికి చెందిన కొమనపల్లి ఏసుబాబు కొబ్బరి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి మరణించినాడు. బాధిత కుటుంబాలను ఎంఎల్‌సి పరామర్శించారు. ఆయన వెంట వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు, మురమళ్ళ సర్పంచ్ శ్రీ కాలే రాజబాబు, వీరేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ పెనుమత్స వాసు రాజు, గోకవరపు మల్లి బాబు, ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ సవరపు శ్రీహరి ఉన్నారు.

పిసిసి సభ్యునికి పరామర్శ

ప్రజాశక్తి - అంబాజీపేట

పిసిసి సభ్యులు ములపర్తి మోహనరావు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను శనివారం పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పిసిసి సభ్యులు మాచవరపు శ్రీమనారాయణ, మండల అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి, డిసిసి కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయిల్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజా సమస్యలపై పాలకులకు పూర్తిగా చిత్తశుద్ధికరువైందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. వారం రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వైఖరే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అక్రమాలు జరిగాయంటూ టిడిపి అధినేత చంద్రబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. ఈ అరెస్టుతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా తెలుగుదేశం అభిమానులలో కలవరం మొదలైంది. ఆ పార్టీ నేతలు అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనా కార్యక్రమాలకు పిలువు ఇవ్వడంతో ఎక్కడికక్కడే నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నిరసనలతో పాటు అధికార ప్రభుత్వానికి మద్దతుగా కార్యక్రమాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా గత రెండు రోజులుగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ అధికార, ప్రతిపక్ష నేతలు చంద్రబాబు అరెస్టుపై విమర్శలు ప్రతి విమర్శలకు పాల్పడటం మినహా అర్థవంతమైన చర్చ నిర్వహించలేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవోంది. నిత్యావసర సరుకుల ధరల పెరగటం, బియ్యం ధరలకు రెక్కలు రావటంతో పాటు విద్యుత్ ఛార్జీలు, పన్నుల భారాలు ఒక్కొక్కటిగా సామాన్య ప్రజలను చుట్టుముడుతున్నాయి. ఓ వైపు వర్షాభావ పరిస్థితులతో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బాధ్యాతాయుతంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

గోదారి గలగలలు

చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు

జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. తాజాగా సెంట్రల్ జైలులో ఓ ఖైదీ డెంగీతో చనిపోవటం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో చంద్రబాబు భద్రతపైనా ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో జైళ్ల శాఖ డిఐజి స్పందించి దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లావ్యాప్తంగా జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో ఒపిల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చందంగా మారాయి. బ్లడ్ టెస్ట్‌లు మొదలుకుని వివిధ రకాల పరక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడం లేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమహేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తమ గ్రామాల్లోనే ఆర్ఎంపిలు, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా పంపిణీలో రాజకీయ జోక్యం

ప్రజా పంపిణీలో రాజకీయ జోక్యం పెరగనుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం చౌదధరల డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న విషయం విధితమే. గతంలో 11 రకాల సరుకులు ఇచ్చేవారు. క్రమ క్రమంగా బియ్యం, పంచదారకే పరిమితం అయ్యారు. తాజాగా రేషన్ బియ్యం నల్లబజారుకు చేరుతుందనే సమాచారంతో అడ్డుకట్ట వేసేందుకు రేషన్ డిపో స్థాయితో మొదలై జిల్లా స్థాయి వరకూ కమిటీలు రూపొందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా కాకినాడ కేంద్రంగా ఉచిత బియ్యాన్ని అక్రమమార్గంలో మిల్లర్లకు తరలిస్తున్నారని, వాటిని పాలిష్ చేసి మళ్లీ బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీన్ని అరికట్టడానికి ప్రజాప్రతినిధులతో నిఘా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రేషన్ సరుకుల పంపిణీ తీరు, డిపోల సమయపాలన, తూకాల్లో మోసాలను అరికట్టడం, సరుకుల అక్రమ రవాణాను అడ్డుకోవడం కమిటీల బాధ్యతలుగా నిర్దేశించారు. అయితే ప్రజాప్రతినిధుల జోక్యం మొదలైతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సరుకుల పంపిణీలో అక్రమాలు జరగకుండా కమిటీలకు అవగాహన కల్పించడమే కీలకం.

గోదావరిని కాలుష్యం బారి నుంచి కాపాడాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గోదావరి నదిని కాలుష్యం బారి నుంచి కాపాడే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నేతత్వంలో చేపట్టిన 'స్వచ్ఛతాహి సేవ', ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాలలో భాగంగా నగరంలోని ఘాట్‌లను శుభ్రం పరిచే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిపి శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో మాత్రమే ఇటువంటి కార్యక్రమాలను విజయవంతం చేయగలమని, పవిత్ర గోదావరి నదిని కలుషితం కాకుండా ప్రజలే బాధ్యత వహించి, వ్యర్థాలు నదిలో కలుపకుండా చూడాలని కోరారు. నగరపాలక సంస్థ గోదావరి నది కలుషితం కాకుండా ఉండటానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని, అందులో భాగంగా ప్రజలను సమీకరించి ఎప్పటికప్పుడు ఘాట్లను శుభ్రపరచే కార్యక్రమాన్ని చేస్తున్నామని, ఇది నిరంతరం కొనసాగుతుందని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి గోదావరిని కాలుష్య రహితంగా ఉంచేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని అన్నారు. డిప్యూటి కమిషనర్ జి.సాంబశివరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొవ్వూరు బార్ అసోసియేషన్ హాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పివిపి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు హత్యలు తీవ్రంగా పెరిగాయని, వీటిని అరికట్టడానికి న్యాయవాదులు రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రంలో అన్ని బార్ అసోసియేషన్లకు భవనాలు ఏర్పాటు చేయాలని, మహిళా న్యాయవాదులకు ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలని, కోర్టులో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజేతలతో శ్రీనివాస్ తదితరులు

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఆలమూరు

కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్ ఐ) క్రీడల్లో మండలంలోని చెముడులంక ఎస్టిఎస్ఎన్ఎమ్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్ఎం బి.శివరాం కుమార్ తెలిపారు. వీరికి పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విజేతలను సర్పంచ్ తమ్మన శ్రీనివాసు, నేతలు భీమిరెడ్డి నాగేంద్ర, ఈలి గోపాల రావు, పిఎంసి ఛైర్మన్ సుంకర శ్రీనివాసు, ఎంఇఒ సాలెంరాజు, ఎన్.వి.సుబ్బరాజు, కార్యదర్శి యు.రేణుక తదితరులు అభినందించారు.

సిరిపల్లిలో ఎలుకల నిర్మూలనకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలం లోని అన్ని ఆర్‌బికెల్లో ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమము నిర్వహించారు ఈ సందర్భంగా బ్రోమోడియాలిన్ అనే ఎలుకల నిర్మూలన మందును ఉచితముగా పంపిణి చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుండి విచ్చేసిన ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. జ్యోతిర్మయి, ఎడిఎ రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారి వై.శోభ పాల్గొన్నారు. **మండపేట** కేశవరం సొసైటీ వద్ద సొసైటీ ఛైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులకు ఎలుకల మందు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకల నిర్మలనతోనే అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఆర్‌బికె ఛైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపిటిసి సభ్యుడు అన్నందేవుల కృష్ణ, తుపాకుల ప్రసన్నకుమార్, చేబోలు పోసిబాబు, చంద్రమళ్ళ యేసయ్య, అద్దంకి రమణ, సొసైటీ సెక్రటరీ సతీష్ రైతులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

ప్రజాశక్తి-అంబాజీపేట

నందంపూడి లో సర్పంచ్ పితాని మంగాదేవి వీరస్వామి ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మీపతి, హెల్త్ అసిస్టెంట్ జె.వి.ఎస్.ఆర్ ప్రసాద్, ఎఎన్ఎం జయంతి తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై శనివారం ఎంపిపి కార్యాలయములో పంచాయితీ కార్యదర్శులకు, ఎఎన్‌యంలకు, మరియు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ నాతి బుజ్జి సమీక్ష సమావేశం నిర్వహించారు ఆమె మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమము ప్రతి సచివాలయ పరిధిలో జరుగుతుందన్నారు. ప్రతి వాలంటీర్ కుటుంబాన్ని విజిట్ చేసి జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్యశ్రీ గురించి వివరంగా చెప్పి తన క్లస్టర్ లో ఉన్న కుటుంబాలలో ఎంతమంది సభ్యులు వద్ద మొబైల్ ఉంటే అంత మందికి ఆరోగ్యశ్రీ యాప్ డౌన్ లోడ్ చేయాలన్నారు. ప్రతీ వాలంటీర్ వాళ్ల యొక్క జగనన్న ఆరోగ్య సురక్ష హౌస్ హోల్డ్ సర్వే 100 శాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు తెలియజేసారు. అనంతరం హౌసింగ్ తదితర విషాయాలపై చర్చించారు. సమావేశములో పంచాయితీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నందంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్, వైద్య సిబ్బంది

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి - కడియం

వేమగిరి గ్రామంలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమం అమెరికా ఇండియా ఫౌండేషన్ దీపిక ఆధ్వర్యంలో జరిగింది. ఎసిడిపిఒ కనకవల్లి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్ కుమారి, సిడిపిఒ నాగమణి పాల్గొన్నారు. విజయ్ కుమారి మాట్లాడుతూ గర్భం ధరించినప్పుడు ఎదుర్కొనే సమస్యలు, తీసుకోవలసిన ఆహారాలు, ఇతర జాగ్రత్తలు, రక్తహీనతలు వంటి అంశాలపై గర్భిణులకు వివరించారు. అనంతరం గర్భిణీలకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, తల్లులు పిల్లలు, మహిళలు, వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్ సత్య శ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు, పోషణాసాతీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

కాకినాడ కార్పొరేషన్ : ఎయిడ్స్ వ్యాధి నివారణకు జీవనశైలి, జాగ్రత్తలపై యువతకు అవగాహన అవసరమని రెడ్ క్రాస్ ఛైర్మన్ వైడి.రామారావు, డిఎంహెచ్ఒ నరసింహ నాయక్, అధికారి ఆర్.రమేష్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌పి కార్యాలయం నుంచి భానుగుడి వరకు నిర్వహించిన మారథాన్ 5కె రన్ కార్యక్రమాన్ని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యంగా 17 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉన్న యువత ఎయిడ్స్ బారిన పడుతున్నట్లు గుర్తించినట్టు చెప్పారు. యువతలో ఎయిడ్స్ కంట్రోల్‌పై అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపు నిచ్చారు. వర్షం పడుతున్న 5 కే రన్ లో పెద్ద ఎత్తున యువత పాల్గొనడం అభినందనీయమన్నారు.

జిల్లాస్థాయికి ఎంపికైన గుమ్మళ్లదొడ్డి విద్యార్థులు

ప్రజాశక్తి - గోకవరం

గుమ్మల్ల దొడ్డి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను చాటుకుని జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. త్రో బాల్, కబాడీ, కోకో, అథ్లెటిక్స్ విభాగాల్లో ఎంపికైన విద్యార్థులను పిఎంసి ఛైర్మన్ పి చిన్ని అభినందించారు. హెచ్ఎ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆటల పోటీలలో 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారని తెలిపారు. జిల్లాస్థాయిలోనూ ఉత్తమంగా రాణించి రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పిఈటి ఎస్.వెంకట జగదీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో కోడిగుడ్లు పరిశీలిస్తున్న ఎంపిపి

గడప..గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న పినిపే శ్రీకాంత్

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-మండపేట

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనశాల, విద్యార్థులకు అందించే గుడ్లు తదితర వాటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశుభ్ర వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్వీపర్లకు సూచించారు. అనంతరం నదుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, ఒకటో సచివాలయం కన్వీనర్ గనిశెట్టి సత్తిబాబు, లారీ యూనియన్ ప్రెసిడెంట్ గంధం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన పలువురు వైసిపి నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా జరుగుతున్న రిలే నిరహారదీక్షలో వైసిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారంతా పార్టీ విజయం కోసం కృషి చేయాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కాగడాల ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించిన టిడిపి శ్రేణులను పోలీసులు అడ్డుకోవడం దారుణమని అన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పేదల సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఉప్పలగుప్తంలో శనివారం నిర్వహించిన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలయ్య, బిసి సెల్ విభాగం మండల అధ్యక్షుడు యనమదల పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ బోటనీ విభాగాలు సంయుక్త నిర్వహణలో 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు ప్రెస్టేజియస్ సమర్థన్ ట్రస్ట్ కళాశాల్లోని వికలాంగ విద్యార్థులకు సుమారు రూ.70 వేల ఉపకార వేతనలను చెక్కులను అందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు కుట్టు మిషన్లు అందజేస్తామని కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన బిక్కిన చక్రవర్తి, అమ్మ ఫౌండేషన్ అధినేత ఇమ్మడిశెట్టి నాగభూషణంలు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, కాళ్లకూరి గొల్లబాబు, బొబ్బ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీకే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

THE BAR ASSOCIATION
RAJAHMUNDRY
TENDER NOTICE
Trees two in number are going to be placed in Public auction in the premises District Court Complex, behind Bar Association, Building, Rajamahendravaram on 29-09-2023 at 10 AM mentioned below.

S.NO.	DESCRIPTION OF ITEM	QUANTITY
1	Live trees (Nidra ganneru)	2

Note:
1) Auction procedure will be commenced at sharp 10 AM on 29-09-2023. The intended participants can verify the tress from 9.30 AM on the same day before conducting auction.
2) The auction purchaser has to cut the trees at his own expenses including transport charges and submit PAN munber and Aadhar number at the premises of the auction.
3) The auction purchaser has to pay the amount in time to enable this association to remit the same to the Government account.
4) All the rights are reserved with the association regarding auction procedure in all aspects.

Rajahmundry
Dt. 22-09-2023
Sd/- PRESIDENT
BAR ASSOCIATION

యానాం వార్తలు

వినాయక ఆలయాలను సందర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి-యానాం

గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ఆలయాలను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శనివారం సందర్శించారు. స్థానిక కనకాల పేట గణపతి నగర్, టాక్సీ స్టాండ్, పాత బస్టాండ్, ఫరం పేట, అబ్దుల్ కలామ్ నగర్, కురసం పేట, ఓల్డ్ రాజీవ్ నగర్ ఆలయాల్లో ఎంఎల్ఎ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు 108 కేజీల లడ్డూ వేలం

ప్రజాశక్తి-యానాం

స్థానిక చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో పంచమ దశ గణపతి నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన విజయ గణపతి విగ్రహం వద్ద 108 కేజీల లడ్డూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ వేలం పాటలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తృణధాన్యాలపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని దానవాయిపేటలో ఉన్న మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో తృణధాన్యాలపై జిల్లా స్థాయి సైన్స్ సదస్సును నిర్వహించడం జరిగిందని జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాస నెహ్రూ తెలిపారు. తృణధాన్యాలు పోషకాహారమా లేక వ్యామోహమా అన్న అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని 11 మండలాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సదస్సులో పాల్గొని పలు ప్రాజెక్టులను సమర్పించారని వివరించారు..గోపాలపురం మండలం కొవ్వూరుపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి జి వాసు కష్ణ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు నెహ్రూ తెలిపారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్ లో వాసు కృష్ణ పాల్గొంటాడని చెప్పారు. ఈ సెమినార్‌లో న్యాయ నిర్ణేతగా ఆచార్య ఎన్. జి రంగా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, హెచ్ఒడి.డాక్టర్ ఎం.విజయ శంకర్ బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా సిఎంఒ శ్రీనివాస్, ఏఎంఒ గౌరీ శంకర్, ఎన్‌జిసి కో ఆర్డినేటర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రామును పరామర్శించిన జ్యోతుల

ప్రజాశక్తి - గోకవరం

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి నియోజకవర్గం తెలుగు యువత అధికార ప్రతినిధి గళ్ళ రామును మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ శనివారం పరామర్శంచారు. ఈయన వెంట టిడిపి నాయకులు పోతుల మోహన్రావు, అడపా భరత్ బాబు, నాగం వెంకటపతి ఉన్నారు.

పేరు మార్పు

VALLURI SUJATA DEVI అను నేను నా పేరును VALLURI SUJATHA గా నా పేరును మార్చుకోవటమైనది. ఇక మీదట నాకు సంబంధించిన అన్ని లావాదేవీలు VALLURI SUJATHA గా వ్యవహరించబడును. కావున ఈ పేరు మార్పు ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయుచున్నాను.

VALLURI SUJATHA
W/o. NARAYANA MURTHY
Mandapeta - 533308

'సి' బుక్ పోయినది

యానాం కనకాలపేటకు చెందిన యాళ్ళ కృష్ణ సాయిదుర్గ శ్రీనివాస్, S/o. యాళ్ళ వీర వెంకట సత్యనారాయణకు చెందిన మోటార్ వెహికల్ "సి" బుక్ నెం. PY04A6611 కనకాలపేట నుంచి యానాం తేది. 11-9-2023న జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. కావున ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్ నందు తెలియపరచవలెను.

యాళ్ళ కృష్ణ సాయిదుర్గ శ్రీనివాస్
S/o. యాళ్ళ వీరవెంకట సత్యనారాయణ
డోర్ నెం. 10-8-040, జమ్మిబాడవ,
కనకాలపేట, యానాం (పుదుచ్చేరి),
పిన్‌కోడ్:533464, సెల్: 7036146777

In the Honourable Court of the Motor Accidents Claims Tribunal cum SCSTC cum IVth Addl. District Judge at Vizianagaram
M.O.P 105/2023

Between:
Y.Eswararao ....Petitioner
And:
Ch.Ramakrishna etc ....Respondents

R3. Md.Mohiddin S/o Sirajuddin driver cum owner of lorry r/o Gandhinagarm Kollavari thota, Mandapeta, East Godavari District.

NOTICE

Please take notice that the above O.P stands posted to 16-10-2023 for notice to the 3d Respondent. You should appear in person or through an advocate at 10-30A.M on the above said date in the above court.

If you fail to appear on the said date the above matter will be decided expartee.

B.Ramakrishna
Advocate
S.Kota, Vizianagaram

ప్రకటన
మహారాజశ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిలు జడ్జి వారి కోర్టు, ప్రత్తిపాడు
E.P. 16/2015, O.S. 67/2007

బిట్వీన్:
పుప్పాల వెంకట శ్రీనివాసరావు ...DHR
మరియు
చింతాకుల లక్ష్మీనరసింహమూర్తి (died)
మరియు ఇతరులు ...JDR's

పై నంబరు కేసులో 3వ JDR అయిన చింతాకుల రాజేష్, S/o. లేటు లక్ష్మీ నరసింహమూర్తి, ఎక్సయిజ్ డిపార్టుమెంట్ అను మీకు గౌరవనీయ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు - సమన్లు పంపినా మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. కావున ది. 15-11-2023వ తేదీ ఉదయం 10.30 నిIIలకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని గౌరవనీయ ప్రత్తిపాడు కోర్టులో హాజరయి మీ ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకోవలెనని, లేనిఎడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఆర్డరుపై తెలియజేయడమైనది.

బుగత వెంకట శివన్నారాయణ
అడ్వకేట్, డో.నెం. 9-4
ప్రత్తిపాడు, సెల్: 9849064436